క్లుప్తంగా

నేడు శనైశ్చరస్వామి జయంతి



అలంకరణలో శని దేవుడు

మోమిన్‌పేట: విశ్వవసు నామ సంవత్సర వైశాఖ బహుళ అమావాస్య మంగళవారం నాడు శనైశ్చరస్వామి జన్మదినాన్ని ఏన్కతల ఆలయంలో నిర్వహిస్తామని ఈఓ నరేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. జయంతి రోజున స్వామి వారిని దర్శించుకోవడంతో పుణ్యం లభిస్తుందన్నారు. నల్లని దుస్తులు, నువ్వుల నూనెతో అభిషేకం చేయడంతో కోర్కెలు నెరవేరుతాయని పేర్కొన్నారు. కావున భక్తులు స్వామి వారి సేవలో తరించాలని ఆయన కోరారు.

కళాశాల నిర్మాణానికి విరాళం



ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న పరిశ్రమ ఎండీ ప్రకాశ్ గోయంకా

షాద్‌నగర్: దాతల సహకారంతో పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సోమవారం ఎలికట్ట గ్రామ శివారులో ఉన్న దేవశ్రీ ఇస్పాత్ పరిశ్రమ యాజమాన్యం రూ.11లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా పరిశ్రమ ఎండీ ప్రకాశ్ గోయంకా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి విరాళానికి సంబంధించిన చెక్కును అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది మోముల బసప్ప పాల్గొన్నారు.

కళాశాల నిర్మాణ పనుల పరిశీలన

ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. నాణ్యతతో పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. సకాలంలో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చెంది తిరుపతి రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, బస్వం, ముబారక్, కొమ్ము కృష్ణ, నర్సింలు, శ్రీనివాస్, రవితేజ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తవ్వారు.. మరిచారు



పైపులైన్ మరమ్మతుల కోసం తీసిన గుంత

మొయినాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో రోడ్డు పక్కనే మంచినీటి పైపులైన్ మరమ్మతుల కోసం తీసిన గుంత ప్రమాదకరంగా మారింది. అది ప్రధాన రోడ్డులోనే ఉండడంతో వాహనాదారులు, పాదచారులకు ఇబ్బందిగా మారింది. చిన్నారులు ఆడుకుంటూ వెళ్లి అందులో పడిపోయే అవకాశం ఉందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని కోరుతున్నారు.

బీసీ సేన గ్రామ మహిళా కమిటీ ఎన్నిక

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లి గ్రామంలో సోమవారం బీసీసేన గ్రామ మహిళా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా భారతమ్మ, ఉపాధ్యక్షురాలిగా నర్సమ్మ, ప్రధాన కార్యదర్శిగా మమత, కోశాధికారిగా బాలమణి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీసీ సేన మండల అధ్యక్షురాలు ప్యాట జయ, నాయకులు బాల్‌రాజ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎస్‌డీఎఫ్ బిల్లులు విడుదల చేయాలి

కొందుర్గు: బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన ఎస్‌డీఎఫ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్ జిల్లేడ్ చౌదరిగూడ మండల అధ్యక్షుడు సయ్యద్ హఫీజ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పక్షపాత ధోరణితో 2023–24 సంబంధించిన బిల్లులు విడుదల చేయకుండా 2025 బిల్లులు విడుదల చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బిల్లుల చెల్లింపులో పక్షపాతం చూపడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీఫ్ షాపును తొలగించాలని వినతి

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో ఉన్న బీఫ్ షాపును తొలగించాలని కోరుతూ వార్డుకు చెందిన బచ్చు శ్రీధర్, బచ్చు లక్ష్మీకాంత్, కుమార్, శేఖర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి సోమవారం మున్సిపల్ కమిషనర్ యోగేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 13వ వార్డులో బీఫ్ షాపు కారణంగా వార్డులో పెద్దఎత్తున దుర్వాసన వస్తోందని, కుక్కలు మాంసపు వ్యర్థాలను తీసుకొచ్చి ఇంటి ముందు వేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

యువవికాసం.. ఎవరిపరం

- రుణం అందుతుందో లేదోనన్న ఆందోళనలో దరఖాస్తుదారులు
- సిబిల్ స్కోర్‌పై అనుమానాలు



రాజీవ్ యువ వికాసానికి అర్జీ చేసుకుంటున్న దరఖాస్తుదారులు (ఫైల్)

దౌల్తాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువవికాసం పథకానికి శ్రీకారం చుట్టింది. రూ.50వేల నుంచి రూ.4లక్షల వరకు రుణాలు ఇచ్చి ఆర్థిక స్వావలంబన దిశగా ప్రోత్సహించాలని నిర్ణయించి దరఖాస్తులు ఆహ్వానించింది. మండలంలో 33 పంచాయతీల నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈబీసీల నుంచి 1,930 మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. మీసేవ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకుని మండల పరిషత్ కార్యాలయంలో అందించారు. వీటిని పంచాయతీల వారీగా విభజించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, ఎంబీసీ క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ల వారీగా విభజించారు. వారిలో అర్హులను గుర్తించి రుణాలందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నివేదికలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు.

అంతిమంగా దక్కేదెవరికో?

మండలంలో దరఖాస్తులను ఇప్పటికే పంచాయతీల వారీగా పరిశీలన జరిపారు. రేషన్‌కార్డు, పేదరికం, దివ్యాంగులు, ఒంటరిమహిళ, గతంలో ఏ పథకం ద్వారా లబ్ధి పొందకుండా ఉండడం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ప్రాథమిక అర్హత ఉందా లేదా పరిశీలిస్తున్నారు. అంతిమంగా రాజకీయ నాయకుల అండదండలు ఉన్న వారికే అందుతాయా లేదా అర్హత ప్రకారం కేటాయిస్తారా..? అనే సందేహాలతో దరఖాస్తుదారులున్నారు. నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ అర్హుల జాబితాలో తమ పేర్లు ఉండేలా చూడాలంటూ కోరుతున్నారు. బ్యాంకర్లు సిబిల్ స్కోర్ ఆధారంగా రుణం అందిస్తారేమోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇంకోపక్క ప్రభుత్వం జూన్ మొదటి వారంలో రుణాలు ఇచ్చేందుకు సన్నద్ధమవుతుంది.

ఉన్నతాధికారులకు నివేదించాం

రాజీవ్ యువవికాసం పథకం కింద వివిధ కేటగిరీలకు 1,960 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటన్నింటిని విభజించి ఉన్నతాధికారులకు పంపించాము. అధికారుల ఆదేశాల మేరకు ఎంపిక జరుగుతుంది. అర్హులకు తప్పకుండా రుణాలు మంజూరవుతాయి. ఎవరూ ఆందోళన చెందవద్దు.

– శ్రీనివాస్, ఎంపీడీఓ, దౌల్తాబాద్

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



మోత్కూరులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న నాయకులు

దోమ: గ్రామాల్లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామని పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మోత్కూరులోని చెంచు కాలనీలో పార్టీ నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని, ప్రతి పేదవాడికి ఇల్లు ఇచ్చే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని గుర్తు చేశారు. అనంతరం మోత్కూరు గేటు నుంచి గోన్యానాయక్‌తండా వరకు రూ.26 లక్షలతో వేసిన బీటీ రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ యాదయ్యగౌడ్, పీఏసీఎస్ డైరెక్టరు శ్రీనివాస్, నాయకులు రాములు నాయక్, రమేష్‌గౌడ్, సురేష్‌నాయక్, రాఘవేందర్, రఘు, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భారత సైన్యానికి మద్దతుగా ర్యాలీ



జాతీయ జెండాలతో నాయకులు

మర్పల్లి: ఆపరేషన్ సిందూర్‌తో భారత సైనిక బలగాల సామర్థ్యం ప్రపంచానికి తెలిసిందని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఈ విజయాన్ని భారతీయులందరూ గర్వించాలని పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ, హిందూ వాహిని ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి ప్రధాన వీధుల గుండా భారత సైన్యానికి మద్దతుగా నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగించారు. భారతీయులు గర్వపడే విధంగా సైన్యం ఆపరేషన్ సిందూర్‌తో శత్రుదేశం పాకిస్తాన్ గుండెల్లో గుబులు పుట్టించిదని నేతలు స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా తిరంగా జెండాలతో ర్యాలీలు తీయడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో నాయకులు మురళీధర్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్, రామేశ్వర్‌రెడ్డి, బలరాంగౌడ్, అన్నపూర్ణ, జైపాల్, శ్రీమంత్‌కుమార్, మహేశ్, రమేశ్, సురేశ్, హిందూవాహిని కార్యకర్తలు పాల్గొన్నారు.

వారసత్వ ఆస్తిని పంచిన అధికారులు



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

యాలాల: ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా మారిన వారసత్వ ఇంటి భాగం సమస్యను మండల అధికారులు సోమవారం పరిష్కరించారు. మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్ గ్రామానికి చెందిన గుర్రాల ఇందిరా, గుర్రాల శ్రీనివాస్‌రెడ్డి, గుర్రాల సుజాత, గుర్రాల సరస్వతీలు తమ వారసత్వంగా ఉన్న ఇంటి సమస్యను పరిష్కరించాలని ఇటీవల కలెక్టరేట్ ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయంలో జిల్లా పంచాయతీ అధికారి సూచన మేరకు మండల పంచాయతీ అధికారి యాదయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి తారకచారిలు సోమవారం వారి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. గ్రామ పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధుల సమక్షంలో ఇంటి భాగాలను సామరస్య పూర్వకంగా ఇంటి యజమానులకు కేటాయించారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను గ్రామస్తులు, బాధిత వ్యక్తుల సమక్షంలో పరిష్కరించినట్లు ఎంపీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహ, స్థానికులు నర్సిరెడ్డి, ఎల్.నర్సిరెడ్డి, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

రాగిజావ పంపిణీ

యాలాల: రాగిజావతో ఆరోగ్యానికి మేలు కలుగుతుందని తాండూరు ఏఎంసీ డైరెక్టర్ గోనేగారి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ పేరి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పేరి రాజేందర్‌రెడ్డి ఏర్పాటు చేయించిన చలివేంద్రంలో రాగిజావ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ప్రజా సేవలో భాగంగా ప్రజలకు రాగిజావా పంపిణీ అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగయ్య, మారుతీ, మైనోద్దీన్, నవీన్, సుదర్శన్, శ్రీనివాస్, సాయిలు తదితరులు ఉన్నారు.

గ్రీన్ ఇండియా హరిత సేన మండల ఇన్‌చార్జిగా పృథ్వీరాజ్

చేవెళ్ల: బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఎంపీ సంతోష్ కుమార్ గ్రీన్ ఇండియా హరితసేన చేవెళ్ల మండల ఇన్‌చార్జిగా పృథ్వీరాజ్ ఎన్నికైనట్లు పార్టీ మండల అధ్యక్షుడు పి.ప్రభాకర్ తెలిపారు. చేవెళ్లలో సోమవారం గ్రీన్ ఇండియా హరిత సేన ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. గ్రీన్ ఇండియా హరితసేన చేవెళ్ల ఇన్‌చార్జిగా ఆలూరుకు చెందిన పృథ్వీరాజ్‌ను ఎంపిక చేసినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. తన ఎన్నికకు కృషి చేసిన మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్, గ్రీన్ ఇండియా కో–ఫౌండర్ రాఘేందర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కేటీఆర్ క్యాంపు కార్యాలయంపై దాడి సరికాదు

మొయినాబాద్‌రూరల్: సిరిసిల్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని చేవెళ్ల బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి దేశమల్ల ఆంజనేయులు అన్నారు. సోమవారం హిమాయత్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్ క్యాంపు కార్యాలయంలో రేవంత్‌రెడ్డి ఫొటో పెడతామని వచ్చి దాడికి యత్నించిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలన్నారు.

ముగిసిన ఉచిత కరాటే శిక్షణ



సర్టిఫికెట్లు అందుకున్న చిన్నారులతో నిర్వాహకులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని మేరినాట్స్ గ్రౌండ్‌లో నెల రోజులుగా మాస్టర్ జపాన్ షోటోకాన్ కరాటే అసోసియేషన్‌ఆధ్వర్యంలో కొనసాగిన సమ్మర్ ఫ్రీ కరాటే శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమం ఎన్నెపల్లి చౌరస్తాలో స్పోర్ట్స్ హబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు నెల రోజులుగా నేర్చుకున్న శిక్షణను ప్రదర్శించారు. అనంతరం బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్(అడ్మిన్) డి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. కరాటే ఆత్మరక్షణకు ఎంతో దోహదపడుతుందన్నారు. నేటి సమాజంలో చిన్నారులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కరాటేతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం, స్నేహభావం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎండీ హాఫీజ్, చీఫ్ ఆర్గనైజర్ ఖాజాపాషా, నాయకులు విజయ్, ప్రియదర్శిని, వెంకటయ్య, కృష్ణ, మాణిక్‌నాయక్, కరీం, మధు మోహన్, ప్రజ్వల్‌కుమార్, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు కొత్త పాత్రలు



వంట పాత్రలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

తీరనున్న మధ్యాహ్న భోజన కార్మికుల వెతలు

దౌల్తాబాద్: ఏళ్ల కిందట పాఠశాలలకు ఇచ్చిన వంట పాత్రలు ప్రస్తుతం పనికిరాని స్థితికి చేరాయి. సొంతంగా కొనుక్కోవడమో లేదా ఉన్న వాటితో సర్దుకుపోవడమో జరుగుతుందని మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీ నిర్వాహకులు వాపోయారు. కొత్తవి కొనుగోలు చేయాలని హెచ్‌ఎంలకు మొరపెట్టుకున్నారు. వీటిపై దృష్టి పెట్టిన రాష్ట్ర విద్యాశాఖ సరిపడా వంట పాత్రలు సరఫరా చేసేందుకు నిర్ణయం తీసుకుని నిధులు విడుదల చేసింది. ఈ క్రమంలో పాఠశాలలకు 37 మంజూరైన వంట పాత్రలను సోమవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈఓ వెంకట్‌స్వామి పంపిణీ చేశారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా బడులకు వంట పాత్రలు సరఫరా చేశారు. విద్యార్థుల సంఖ్య పదిలోపు ఉన్న రెండు పాఠశాలలను ఎంపిక చేయలేదు.

కేటాయింపు ఇలా

50 మంది విద్యార్థులు ఉండే పాఠశాలకు వంట కోసం 10కిలోల అన్నం పాత్ర, ఒక్కొక్కటి 5 కిలోల సామర్థ్యం ఉన్న మూడు కూర సాంబారు గంజలు, రెండు స్టీల్ బకెట్లు, నాలుగు చెంచాలు, రెండు బేషన్ బుట్లు, ఒక కప్‌గీర్ మూతలు పంపిణీ చేశారు. వీటి కోసం పాఠశాలకు రూ.10 వేలు కేటాయించారు. 51–150 వరకు 30కిలోల అన్నం పాత్ర, 10 కిలోలవి మూడు కూర గంజలు, మిగతా పాత్రలు, 151–250 వరకు 50 కిలోల అన్నం పాత్ర, 15 కిలోలవి కూర గంజలు, మిగతా వాటికి 20 వేలు ఖర్చు చేశారు. సంఖ్య 251కి పైబడి ఉన్న పాఠశాలలకు 50 కిలోల అన్న పాత్రతో పాటు 20 కిలోలవి రెండు, 15కిలోల ఒక కూర గంజ, ఇతర పాత్రలతో పాటు పంపిణీ చేశారు. వీటికి రూ.25వేలు కేటాయించారు. వంట పాత్రలు పంపిణీ చేయడంపై ఏజెన్సీల నిర్వాహకులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఆర్డీఓ చంద్రకళ



ఆర్డీఓ చంద్రకళకు ఫిర్యాదు అందిస్తున్న చనువెల్లి గ్రామ రైతులు

చేవెళ్ల: ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఆర్డీఓ చంద్రకళ అన్నారు. సోమవారం చేవెళ్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో రెండు ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. ఇందులో శంకర్‌పల్లి మున్సిపాలిటీ కేంద్రంలో ఫతేపూర్ రోడ్డును బాగు చేయాలని సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేశ్‌కుమార్ ఫిర్యాదు చేయగా, మరొకటి చేవెళ్ల మండలంలోని చనువెల్లిలో పలువురు రైతులు ఖమ్మం నర్సరీలో తెచ్చిన నారుతో మోసపోయామని న్యాయం చేయాలని ఫిర్యాదు చేసినట్లు స్పష్టం చేశారు. ఈ రెండు ఫిర్యాదులలో ఒకటి శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌కు పంపించామని, మరొకటి చేవెళ్ల అగ్రికల్చర్ అధికారులకు పంపించి పరిష్కరించాలని సూచించినట్లు వెల్లడించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు దాదాపు 46 ఫిర్యాదులు వచ్చాయని, వీటిలో 30కిపైగా పరిష్కరించామన్నారు. ఎక్కువగా భూముల సమస్యలకు సంబంధించి ధరణిలో ఉన్న ఇబ్బందులపై వచ్చిన వాటితో పాటు ఇతర అన్ని రకాల ఫిర్యాదులు ఉన్నాయన్నారు.

కాంగ్రెస్‌లో పదవుల జాతర

ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

తాండూరు రూరల్: అధికార కాంగ్రెస్ పార్టీలో పదవుల జాతర మొదలైంది. ప్రస్తుతం పార్టీ మండల అధ్యక్షుల ఎన్నికలపై అధిష్టానం కసరత్తు ప్రారంభించింది. డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి మండలంలో నూతన కమిటీల ఏర్పాట్లు చేయనున్నారు. ఈ మేరకు ఆశావహులు దరఖాస్తులు చేసుకుంటున్నారు. 2017 నుంచి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేసిన వారికే అధ్యక్ష పదవి ఇస్తామని అధిష్టానం తేల్చి చెప్పింది. దీంతో పాత నాయకులు దరఖాస్తులు చేసుకునేందుకు ముందుకు వచ్చారు. కరన్ కోట్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాజ్‌కుమార్, వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పట్లోళ్ల పురుషోత్తంరెడ్డి, మిట్టబాసుపల్లి గ్రామానికి చెందిన జగదీశ్వర్‌లు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బీసీ సామాజికవర్గానికి చెందిన గౌతపూర్ గ్రామస్తుడైన జెన్నె నాగప్ప పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. మరోసారి అవకాశం ఇస్తారనే ప్రచారం కూడా కొనసాగుతుంది. మండల పార్టీ అధ్యక్ష పదవికి సంబంధించి సామాజిక నేపథ్యం కీలకం కానుంది.

పాత నేతల హర్షం

పెద్దేముల్ మండలంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా తట్టెపల్లికి చెందిన గోపాల్ కొనసాగుతున్నారు. తాజాగా అధిష్టానం అధ్యక్ష పదవి కోసం దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆశావహులు అర్జీలు అందజేస్తున్నారు. పెద్దేముల్ మండల కేంద్రానికి చెందిన న్యాయవాది ఎల్లారెడ్డి, మంబాపూర్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డిలు అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. అయితే అధిష్టానం ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన వారికి అధ్యక్ష పదవి ఇచ్చే ప్రసక్తిలేదని తేల్చి చెప్పడంతో నిరాశ చెందుతున్నారు. కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకొని ఉన్నవారికి అవకాశం ఇస్తామనడంతో పాత కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

శంకర్‌పల్లి: ఫర్టిలైజర్ దుకాణదారులు విత్తనాల విషయంలో జాగ్రత్తలు వహించాలని, ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని వ్యవసాయాధికారులు, పోలీసులు హెచ్చరించారు. సోమవారం శంకర్‌పల్లిలో ఫర్టిలైజర్ డీలర్లతో చేవెళ్ల ఏడీఏ సురేశ్‌బాబు, వ్యవసాయాధికారులు, పోలీసులు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీలర్లు డబ్బులకు ఆశపడి నకిలీ విత్తనాలు అమ్మితే, రైతులు దిగుబడి రాక మోసపోతారని, ఇది పెద్ద నేరమని స్పష్టం చేశారు. అదేవిధంగా రైతులకు అమ్మిన విత్తనాలకు సంబంధించి పక్కాగా రికార్డులు మెయింటెన్ చేయాలని సూచించారు. వ్యవసాయాధికారులు, పోలీసులు ఏ క్షణంలోనైనా తనిఖీలు చేస్తారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సొంతింటి కల నెరవేరుస్తాం

షాబాద్: పేదల సొంతింటి కలను నెరవేరుస్తామని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీం భరత్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని తాళ్లపల్లి, పోతుగల్, షాబాద్, కక్కులూర్, కేసారం, అంతారం గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి వారు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. పేదల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పథకాలు రూపొందించి అమలు చేస్తోందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.

సర్కారు బడుల్లోనే మెరుగైన విద్య

బడిబాటలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



ధారూరులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని మండలంలోని జినుగుర్తి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నాగప్ప అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామస్తులతో పాటు తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందించడంతో పాటు మెరుగైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాంలింగారెడ్డి, అజ్మత్‌అలీ, ప్రవీణ్‌గౌడ్, కుర్వ నర్సిములు, రాములు, భాస్కర్, దేవయ్య, అనిత, నీలమ్మ, తుల్జమ్మ, మహాదేవి, మంజుల, ఉపాధ్యాయులు స్వప్నకుమారి, భాగ్యశ్రీ, నర్సిములు తదితరులు ఉన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

ధారూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుటకు ప్రతిఒక్కరూ సహకరించాలని ధారూరు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ధారూరు బాలికలు, బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. గ్రామ పంచాయతీ నుంచి కమాన్ మీదుగా ఆర్టీసీ బస్టాండు సమీప అంబేడ్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు తల్లిదండ్రులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.



దుద్యాల్: ఎంపీడీఓ కార్యాలయం ఎదుట అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

వసతుల కల్పన

దుద్యాల్: ప్రభుత్వ పాఠశాలలోనే ఉత్తమైన విద్య లభిస్తుందని ఎంఈఓ విజయ రామారావు అన్నారు. సోమవారం మండల ప్రధాన చౌరస్తాలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులకు మరింత క్లుప్తంగా విషయ అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ అందించామన్నారు. తల్లిదండ్రులు, గ్రామస్తులు, నాయకులు అందరూ కలిసి పాఠశాలలో విద్యార్థులను చేర్పించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, హెచ్‌ఎం చందర్ నాయక్, మాజీ సర్పంచ్ ఖాజా, ఉపాధ్యాయులు రవీందర్‌గౌడ్, మల్లప్ప, శ్రీనివాస్, వెంకటయ్య, సంపత్, నరసింహారావు, సీఆర్‌పీ రాందాస్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



తాండూరు రూరల్: బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు